ఉత్తరం
# కాకతీయ
TG TEL/25/A1234 www.kakatiyanews.com
ఆదివారం, 25 అక్టోబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 62 | పేజీలు: 4 వెల: 5

## కార్యకర్తలకు లీగల్ సెల్ అండగా నిలవాలి!

- న్యాయవాదుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- హెల్త్ ఇన్సూరెన్స్ రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంపుపై పరిశీలన
- అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్, సంక్షేమ సమస్యల పరిష్కారానికి చర్యలు : మంత్రి శ్రీధర్‌బాబు




**కాకతీయ, హైదరాబాద్ :** ఫీజులు చెల్లించలేని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులకు లీగల్ సెల్ న్యాయవాదులు అండగా నిలవాలని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో పార్టీ న్యాయవాదులు క్రియాశీలకంగా పనిచేస్తూ కార్యకర్తలకు న్యాయపరమైన సహకారం అందించాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడే న్యాయవాదులకు

........(తరువాయి 2లో)




## చిక్కుముడి విప్పే పోలీసు!

- క్లిష్ట కేసుల ఛేదనలో సీఐ విశ్వేశ్వర్ ప్రత్యేక ముద్ర
- సంచలనాత్మక కేసుల దర్యాప్తులో కీలక పాత్ర
- పెట్రోల్ దాడి హత్య కేసులో వేగంగా నిందితుల గుర్తింపు
- లారీ, హమాలీ సంఘాల వివాదాలకు ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో పరిష్కారం
- ఏడాదిలో గీసుగొండ స్టేషన్ పరిధిలో నేరాల రేటు 25 శాతం తగ్గింపు
- సర్పంచ్ ఎన్నికలు, కొమ్మాల జాతరలో శాంతిభద్రతల పరిరక్షణ
- యువత డ్రగ్స్ బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు
- ప్రశంసలు అందుకుంటున్న యువ పోలీసు అధికారి



3

కేసు ఎంత క్లిష్టమైనా.. చిక్కుముడి విప్పాల్సిందే! నేరాల ఛేదనలో వేగం.. వివాదాల పరిష్కారంలో చొరవ.. శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తత.. ఈ మూడు అంశాలతో గీసుగొండ సీఐ విశ్వేశ్వర్ తనదైన ముద్ర వేస్తున్నారు. పెట్రోల్ దాడి హత్య కేసులో నిందితులను రెండు, మూడు రోజుల్లో గుర్తించడం నుంచి లారీ, హమాలీ సంఘాల మధ్య వివాదాలను ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో పరిష్కరించడం వరకు విభిన్న బాధ్యతల్లో చొరవ చూపుతున్నారు. ఏడాది కాలంలో గీసుగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాల రేటు 25 శాతం తగ్గినట్లు రికార్డులు వెల్లడిస్తుండటమే ఆయన పనితీరుకు నిదర్శనం. సైబర్ నేరాలు, మత్తు పదార్థాలపై యువతకు అవగాహన కల్పిస్తూ ప్రజలకు చేరువయ్యే ప్రయత్నం చేస్తున్నారు. క్లిష్ట కేసుల దర్యాప్తు నుంచి ప్రజల మధ్య వివాదాల పరిష్కారం వరకు.. గీసుగొండలో పోలీసింగ్‌కు కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తున్న యువ అధికారి విశ్వేశ్వర్ ప్రజల నుంచి ప్రశంసలు అందుకుంటున్నారు. - కాకతీయ, గీసుగొండ

## ఎల్‌నినోపై రాజకీయాలు వద్దు..

- అధికార యంత్రాంగం ప్రజలకు అండగా నిలవాలి!
- విద్యుత్ డిమాండ్ 20,018 మెగావాట్లకు చేరింది
- 15 లక్షల వ్యవసాయ పంపుసెట్ల పరిధిలో భూగర్భ జలాల కొరత
- గ్రామీణ ఉపాధి కోసం 17 లక్షలకు పైగా పనుల గుర్తింపు
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రం వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్న వేళ రాజకీయ విమర్శలకు తావివ్వకుండా ప్రజలకు అండగా నిలవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రతిపక్షాలకు సూచించారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు ఉపయోగపడే సలహాలు, సూచనలు ఇవ్వాలని, ప్రభుత్వంపై విమర్శలకే పరిమితం కావడం సరికాదని అన్నారు. నీటి కొరత, పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం చింతకాని మండలం కొదుమూరులో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 2014లో 6,648 మెగావాట్లు ఉండగా, ప్రస్తుతం 20,018 మెగావాట్లకు చేరిందని భట్టి విక్రమార్క తెలిపారు. 2023లో 15,497 మెగావాట్లుగా ఉన్న డిమాండ్ 2025లో 17,162 మెగావాట్లకు పెరిగిందన్నారు. సాధారణంగా ఏటా 6 నుంచి 6.5 శాతం పెరిగే విద్యుత్ డిమాండ్ ఈ ఏడాది అక్టోబర్‌లో దాదాపు 25 శాతం పెరిగిందని చెప్పారు. గత ఏడాది అక్టోబర్‌లో రోజువారీ విద్యుత్ వినియోగం 245.35 మిలియన్ యూనిట్లు ఉండగా, ఈ ఏడాది 335.05 మిలియన్ యూనిట్లకు చేరిందని వివరించారు. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ వ్యవస్థలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ పరిధిలో 177 సబ్‌స్టేషన్ల నిర్మాణం పూర్తయిందని, మరో 267 సబ్‌స్టేషన్ల పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ట్రాన్స్‌కో పరిధిలో 24 సబ్‌స్టేషన్లకు అనుమతులు ఇవ్వగా, 11 పూర్తయ్యాయని, మరో తొమ్మిది నిర్మాణంలో ఉన్నాయని వివరించారు.

**నీటి కొరతతో జలవిద్యుత్‌పై ప్రభావం**

జలాశయాల్లో నీటి

........(తరువాయి 2లో)



సున్నం చెరువు చెంత పదుల సంఖ్యలో నీటి ట్యాంకర్లు

# హైదరాబాద్‌కు మళ్లీ నీటి గండం!

### 16 మండలాల్లో మూడింటికే సరిపడా వర్షాలు

### రోజుకు 6 వేల నుంచి 8 వేల ట్యాంకర్లకు డిమాండ్

### మూడు, నాలుగు రోజులకోసారి తాగునీటి సరఫరా

### సింగూరు జలాశయంలో 29.9 టీఎంసీలకు 3.4 టీఎంసీలే

### డిసెంబరు నాటికి జలాశయాలు అడుగంటుతాయన్న ఆందోళన

### 25 ఏళ్ల క్రితం నాటి సంక్షోభం మళ్లీ వస్తుందా?

**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** భాగ్యనగరాన్ని నీటి కష్టాలు వెంటాడుతున్నాయి. సాధారణ వర్షపాతం అందకపోవడంతో నగరంలోని 16 మండలాల్లో కేవలం మూడింటికే సరిపడా వర్షాలు నమోదయ్యాయి. ఫలితంగా పలు ప్రాంతాల్లో తాగునీటి కోసం ప్రజలు ట్యాంకర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోజువారీ ట్యాంకర్ బుకింగ్‌లు 6 వేల నుంచి 8 వేల వరకు చేరినట్లు సమాచారం. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌తోపాటు నగర శివారు ప్రాంతాల్లో మూడు, నాలుగు రోజులకోసారి మాత్రమే నీటి సరఫరా జరుగుతోందని నివేదిక పేర్కొంది. పాతికేళ్ల క్రితం జలాశయాల్లో నీటిమట్టాలు పడిపోయి నగరం తీవ్ర నీటి సంక్షోభాన్ని ఎదుర్కొన్న పరిస్థితులు మళ్లీ పునరావృతమవుతాయా? అన్న ఆందోళన వ్యక్తమవుతోంది. హైదరాబాద్ నగరానికి ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, సింగూరు, నాగార్జునసాగర్ జలాశయాల నుంచి నీరు సరఫరా అవుతోంది. కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల నుంచి వచ్చే నీటిపై కూడా నగర అవసరాలు ఆధారపడి ఉన్నాయి. అయితే వర్షాలు తక్కువగా కురవడంతో ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుతున్నాయి. నీటిపారుదల శాఖ గణాంకాల ప్రకారం.. 3.5 టీఎంసీల పూర్తి నిల్వ సామర్థ్యమున్న ఉస్మాన్‌సాగర్‌లో ప్రస్తుతం 2.2 టీఎంసీల

........(తరువాయి 2లో)



## గోదావరి జలాలెందుకు ఎత్తిపోయరు?

### హైదరాబాద్‌లో ప్రజల కష్టాలు కనిపించడం లేదా?

- కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని తరలించాలి
- ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే 750 టీఎంసీలు సముద్రం పాలు
- నగరంలో రోజుకు 7 వేల ట్యాంకర్ బుకింగ్‌లు
- నీటి సమస్య పరిష్కరించకపోతే సీఎం నివాసం ముట్టడిస్తాం
- నీటి సంక్షోభంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆగ్రహం



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** గోదావరి జలాలు సముద్రంలో కలుస్తుంటే.. హైదరాబాద్ ప్రజలు తాగునీటి కోసం ట్యాంకర్లను ఆశ్రయించాలా? కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి వెంటనే నీటిని ఎత్తిపోయకుండా ప్రభుత్వం ఏం చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. నగరంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే హైదరాబాద్ ప్రజలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కాళేశ్వరం

........(తరువాయి 2లో)

## రూ.150 కోట్లతో శాశ్వత కరువు నివారణ!

- మిడ్జిల్, ఉప్పునూతల, మక్తల్ మండలాల్లో ప్రత్యేక ప్రాజెక్టు
- ప్రతి గ్రామంలో సభలు.. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు
- ఖర్చు చేసే ప్రతి రూపాయికీ లెక్క ఉండాలి: మంత్రి పొంగులేటి

3



## పాలమూరు రైతుల గొంతు నులిమే కుట్ర!



- పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుతో సంబంధం లేని డిండి లిఫ్ట్‌ను రద్దు చేయాలి
- శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లోని ప్రతి నీటి బొట్టుపై పాలమూరు రైతులకే హక్కు
- రేవంత్ సర్కారు జిల్లా ప్రయోజనాలను తాకట్టు పెడుతోంది
- మహబూబ్‌నగర్ ఎంపీ, బీజేపీ తమిళనాడు రాష్ట్ర సహ ఇన్‌చార్జి డీకే అరుణ

2

# హైదరాబాద్‌కు మళ్లీ నీటి గండం!

(మొదటిపేజీ తరువాయి)

నీరు మాత్రమే ఉంది. 2.5 టీఎంసీల సామర్థ్యమున్న హిమాయత్‌సాగర్‌లో 2.1 టీఎంసీలు మిగిలాయి. సింగూరు జలాశయంలో 29.9 టీఎంసీలకు గాను 3.4 టీఎంసీలే ఉన్నాయి. 312 టీఎంసీల సామర్థ్యమున్న నాగార్జునసాగర్‌లో 184.2 టీఎంసీల నీరు ఉన్నట్లు నివేదిక వెల్లడించింది.

**మూడు రోజులకోసారి నీటి సరఫరా**

జలాశయాల్లో నిల్వలు తగ్గుతుండటంతో నీటి వినియోగంపై హైదరాబాద్ జలమండలి ఆంక్షలు విధించే దిశగా చర్యలు చేపట్టింది. సాధారణంగా ఒక రోజు విడిచి మరో రోజు సరఫరా చేసే ప్రాంతాల్లోనూ మూడు రోజులకోసారి నీటిని అందించే పరిమిత విధానాన్ని అమలు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి సమీక్ష సమావేశంలో వెల్లడించారు. మిగిలిన నీటిని పొదుపుగా వినియోగించుకోవడమే లక్ష్యమని పేర్కొన్నారు.మరోవైపు ట్యాంకర్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని అదనపు ట్యాంకర్ నిర్వాహకులను జలమండలిలో నమోదు చేయాలని అధికారులు నిర్ణయించారు. అవసరమైన ప్రాంతాలకు నీటిని అందించేందుకు సరఫరా వ్యవస్థను విస్తరించే చర్యలు చేపడుతున్నారు. సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు గోదావరి తాగునీటి పథకం ద్వారా అదనపు నీటిని తీసుకురావడం, కృష్ణా జలాల సరఫరాను పెంచే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అశోక్‌రెడ్డి తెలిపారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాల్లో అదనపు వడపోత పడకల ఏర్పాటుపైనా ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. నిర్మాణ రంగం, ఉద్యానవనాలు, పారిశ్రామిక అవసరాలకు శుద్ధి చేసిన మురుగునీటిని వినియోగించే అవకాశాలనూ పరిశీలిస్తున్నారు.



బెడ్ కింద బోరు



దీంతో తాగునీటి అవసరాలకు అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవచ్చని అధికారులు భావిస్తున్నారు.

**భూగర్భ జలాలపై ఆడిట్**

నగర పరిధిలోని 16 మండలాల్లో భూగర్భ జల వనరుల పరిస్థితిని అంచనా వేసేందుకు జలమండలి నీటి ఆడిట్ నిర్వహిస్తోంది. నీటిని పొదుపుగా వినియోగించుకోవడంతోపాటు విద్యుత్ వినియోగాన్ని తగ్గించే ముందస్తు చర్యలు చేపట్టాలని హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంత ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాకు రాబోయే నెలల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు అత్యవసర సమీక్ష నిర్వహించారు. సంప్రదాయ నీటి వనరుల పునరుద్ధరణ, వర్షపు నీటి నిల్వ, భూగర్భ జలాల సంరక్షణపై దృష్టి సారిస్తే నగర నీటి అవసరాలను తీర్చడంలో కొంత ఉపశమనం లభించే అవకాశం ఉంది.

**ప్రైవేటు ట్యాంకర్లకు భారీగా పెరిగిన గిరాకీ**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నీటి సమస్య పెరుగుతున్న నేపథ్యంలో వాటర్ ట్యాంకర్లకు డిమాండ్ భారీగా పెరుగుతోంది. ఇళ్ల అవసరాలతోపాటు భవన నిర్మాణాలు, ఫంక్షన్లు, ఇతర కార్యక్రమాలకు నీరు తప్పనిసరి కావడంతో ట్యాంకర్ల కోసం ప్రజలు పరుగులు తీస్తున్నారు. ఇదే అదునుగా ప్రైవేటు మార్కెట్‌లో ట్యాంకర్లకు గిరాకీ పెరుగుతోంది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (జలమండలి)కు రోజుకు సుమారు 8 వేల ట్యాంకర్ల కోసం దరఖాస్తులు వస్తున్నట్లు అందిన సమాచారం ఈ డిమాండ్ తీవ్రతను తెలియజేస్తోంది. నగరంలో నీటి అవసరాలు పెరగడంతో జలమండలి ద్వారా ట్యాంకర్లను బుక్ చేసుకునే వారి సంఖ్య పెరుగుతోంది. ఇళ్ల నిర్మాణాలు, శుభకార్యాలు, ఇతర అవసరాల కోసం నీటిని ట్యాంకర్ల ద్వారా తెప్పించుకుంటున్నారు. రోజుకు సుమారు 8 వేల ట్యాంకర్లకు డిమాండ్ ఉండటంతో సరఫరా వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతోంది. జలమండలికి దరఖాస్తు చేసుకున్న వారికి 24 గంటల్లోపు ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. డిమాండ్ పెరుగుతున్న కొద్దీ నిర్ణీత సమయంలో సరఫరా చేయడం కీలకంగా మారుతోంది. అవసరమైన చోట నీరు అందుబాటులో లేకపోతే వినియోగదారులు ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. జలమండలి ద్వారా సరఫరా చేసే ట్యాంకర్ల చార్జీలు బయట మార్కెట్‌తో పోలిస్తే తక్కువగా ఉంటాయి. ప్రైవేటు ట్యాంకర్లకు ప్రస్తుతం రూ.8వేల నుంచి రూ.10వరకు డిమాండ్ నెలకొన్నట్లుగా భాగ్యనగరవాసులు చెబుతుండటం ఆందోళన కలిగిస్తోంది. జలమండలి సరఫరా, ప్రైవేటు ట్యాంకర్ల ధరల మధ్య వ్యత్యాసం వినియోగదారులపై అదనపు భారం పడే అవకాశాన్ని సూచిస్తోంది.

**సున్నం చెరువులో అక్రమ నీటి దందా!**

మాదాపూర్‌లోని సున్నం చెరువు పరిధిలో సాగుతున్న అక్రమ నీటి విక్రయాల వ్యవహారంపై హైడ్రా చర్యలు చేపట్టింది. బస్తీల్లో రహస్యంగా బోర్లు వేసి, భారీ పైపుల నెట్‌వర్క్ ద్వారా నీటిని ట్యాంకర్లకు సరఫరా చేస్తున్న వ్యవస్థను అధికారులు గుర్తించారు. అక్రమంగా ఏర్పాటు చేసిన బోర్లను తొలగించడంతోపాటు నీటి సరఫరాకు ఉపయోగిస్తున్న పైప్‌లైన్ నెట్‌వర్క్‌ను ధ్వంసం చేశారు. ప్రమాదకర లోహాలు కలిగిన నీటిని తాగునీటిగా విక్రయిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం. అయితే నీటిలో ఏయే లోహాలు ఎంత మోతాదులో ఉన్నాయనే అంశంపై అధికారిక పరీక్షల నివేదికలు వెలువడాల్సి ఉంది. సున్నం చెరువు పరిధిలో అక్రమంగా నీటిని వెలికితీసి విక్రయిస్తున్న వ్యవస్థపై హైడ్రా దృష్టి సారించింది. అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన బోర్లు, నీటిని ట్యాంకర్లకు తరలించేందుకు ఉపయోగిస్తున్న పైపుల నెట్‌వర్క్‌పై చర్యలు తీసుకుంది. ప్రజారోగ్యానికి ముప్పు కలిగించేలా కలుషిత నీటిని విక్రయిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. నీటి నాణ్యతపై పరీక్షల ఫలితాలు వెలువడితేనే అందులోని లోహాల స్థాయిపై స్పష్టత రానుంది. మరోవైపు సున్నం చెరువు పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. చెరువుకు సంబంధించిన దాదాపు 20 ఎకరాల పూర్తి స్థాయి నీటిమట్టం హద్దులను నిర్ధారించి, పూడికతీత నుంచి ఫెన్సింగ్ ఏర్పాటు వరకు పనులు చేపట్టారు. చెరువు చుట్టూ నిర్మించిన ఎత్తయిన బండ్, వాకింగ్ ట్రాక్‌లను అధికారులు పరిశీలించారు. లోపలి, బయటి వైపుల ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ పనులనూ తనిఖీ చేశారు. ఆక్రమణల తొలగింపుతో చెరువుతోపాటు పరిసర ప్రాంతాలను కలిపి దాదాపు 30 ఎకరాల మేర అభివృద్ధి చేసినట్లు అధికారులు తెలిపారు.

# పాలమూరు రైతుల గొంతు నులిమే కుట్ర!

- పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుతో సంబంధం లేని డిండి లిఫ్ట్‌ను రద్దు చేయాలి
- శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లోని ప్రతి నీటి బొట్టుపై పాలమూరు రైతులకే హక్కు
- రేవంత్ సర్కారు జిల్లా ప్రయోజనాలను తాకట్టు పెడుతోంది
- మహబూబ్‌నగర్ ఎంపీ, బీజేపీ తమిళనాడు రాష్ట్ర సహ ఇన్‌చార్జి డీకే అరుణ

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** పాలమూరు ప్రజల ఆశీర్వాదంతో ముఖ్యమంత్రి పీఠం అధిష్ఠించిన రేవంత్‌రెడ్డి.. అదే జిల్లా రైతాంగానికి ద్రోహం చేసేలా వ్యవహరిస్తున్నారని మహబూబ్‌నగర్ ఎంపీ, బీజేపీ తమిళనాడు రాష్ట్ర సహ ఇన్‌చార్జి డీకే అరుణ విమర్శించారు. గతంలో కేసీఆర్ పాలమూరు రైతుల మెడకు వేసిన ‘డిండి ఉరితాడు’ను ఇప్పుడు రేవంత్‌రెడ్డి మరింత బిగిస్తున్నారని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుతో సంబంధం లేని డిండి లిఫ్ట్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. పాలమూరు జిల్లాలో ప్రతి ఎకరాకూ సాగునీరు అందించాలనే లక్ష్యంతో గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జూరాల ఆధారంగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు సర్వేకు జీవో నంబర్ 72 తీసుకొచ్చినట్లు డీకే అరుణ గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2015లో కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టు రూపకల్పనను జూరాల నుంచి శ్రీశైలం బ్యాక్‌వాటర్‌కు మార్చిందని ఆరోపించారు. అనంతరం జీవోలు 105, 107 ద్వారా డిండి లిఫ్ట్‌కు పాలమూరు ప్రాజెక్టు నుంచి రోజుకు 0.5 టీఎంసీ నీటిని తరలించే ప్రయత్నం జరిగిందన్నారు. నాడు తాము ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించి పోరాడామని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అదే ప్రతిపాదనను మళ్లీ తెరపైకి తెస్తోందని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును జీవో 72 ప్రకారం జూరాల ఆధారిత పాత రూపకల్పనతోనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

**నల్గొండకు ప్రత్యామ్నాయ మార్గాలున్నాయి**

నల్గొండ జిల్లాలోని దేవరకొండ, మునుగోడు ప్రాంతాల ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి ఎస్‌ఎల్‌బీసీ, నక్కలగండి, పుట్టగండి లిఫ్ట్ వంటి ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని డీకే అరుణ పేర్కొన్నారు. వాటి ద్వారా నీటిని తరలించడంపై అభ్యంతరం లేదని, అయితే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధం లేని డిండి లిఫ్ట్‌ను ఇందులో కలపడం సరికాదని అన్నారు. ఏదుల రిజర్వాయర్ నుంచి పైప్‌లైన్ల ద్వారా నీటిని తరలించే ప్రతిపాదన పాలమూరు రైతుల హక్కులను దెబ్బతీస్తుందని ఆరోపించారు. శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి అదనంగా నీటిని తీసుకునే అవకాశం ఉంటే, లక్షలాది ఎకరాలు సాగునీటి కోసం ఎదురుచూస్తున్న మహబూబ్‌నగర్ జిల్లాకే ప్రాధాన్యమివ్వాలని డిమాండ్ చేశారు. డిండి ప్రాజెక్టు కాల్వల కారణంగా సుమారు 60 కిలోమీటర్ల మేర పాలమూరు భూములు, 30కి పైగా గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ అంశంపై పాలమూరు కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

**సాగునీటి ప్రాజెక్టులు ఎక్కడివక్కడే!**

నెట్టెంపాడు, భీమా, కల్వకుర్తి, కోయిల్‌సాగర్, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదని డీకే అరుణ విమర్శించారు. రిజర్వాయర్లలో పూడికతీత, మరమ్మతులు చేపట్టలేదని ఆరోపించారు. ఆర్డీఎస్ కింద 15.9 టీఎంసీలు, జూరాల కింద 17.84 టీఎంసీల నీటి కేటాయింపులను పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్నారని అన్నారు. జూరాల సమాంతర ప్రాజెక్టు, వంతెన పనులకు నిధులు కేటాయించాలని, ప్రతి నియోజకవర్గానికి సాగునీరు అందించే సమగ్ర ప్రణాళిక రూపొందించాలని డిమాండ్ చేశారు. కొడంగల్, నారాయణపేట ప్రాంతాలకే పరిమితంగా కాకుండా ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అన్ని ప్రాంతాల రైతులకు ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి పదవి శాశ్వతం కాదని, పాలమూరు రైతుల ప్రయోజనాలను విస్మరిస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని డీకే అరుణ హెచ్చరించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు అసలు సమగ్ర ప్రాజెక్టు నివేదికను తిరిగి సమీక్షించి, ప్రతి నియోజకవర్గానికి సాగునీరు అందించేలా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే పాలమూరు రైతాంగ ప్రయోజనాల కోసం రాజీలేని ప్రజా పోరాటం నిర్మిస్తామని స్పష్టం చేశారు.

# ఎల్‌నినోపై రాజకీయాలు వద్దు..

(మొదటిపేజీ తరువాయి)



నిల్వలు తగ్గడంతో జలవిద్యుత్ ఉత్పత్తి కూడా ప్రభావితమవుతోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. సాధారణంగా రాత్రి వేళల్లో గరిష్ఠ డిమాండ్‌ను తట్టుకునేందుకు అందుబాటులో ఉండే సుమారు 3,500 మెగావాట్ల జలవిద్యుత్ ఉత్పత్తిపై నీటి కొరత ప్రభావం చూపుతోందన్నారు. ఒకవైపు 4,000 నుంచి 5,000 మెగావాట్ల అదనపు డిమాండ్ పెరుగుతుండగా, మరోవైపు ఉత్పత్తి తగ్గడం సవాలుగా మారిందని పేర్కొన్నారు. అయినప్పటికీ నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్రంలో సుమారు 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లు ఉండగా, వాటిలో దాదాపు 15 లక్షల పంపుసెట్ల పరిధిలో భూగర్భ జలాల కొరత ఉందని భట్టి విక్రమార్క వెల్లడించారు. బోర్లలో నీరు లేకపోయినా మోటార్లు ఆన్ చేయడం వల్ల అవి కాలిపోవడంతోపాటు ట్రాన్స్‌ఫార్మర్లపై భారం పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. భూగర్భ జలాలు అందుబాటులో లేని ప్రాంతాల్లో మోటార్లు ఆన్ చేయవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు.

**తాగునీటికి ప్రాధాన్యమివ్వాలి**

రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల మొత్తం 470.22 టీఎంసీల నిల్వ సామర్థ్యానికి సంబంధించి ప్రస్తుతం 178.60 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని 44,034 చెరువుల్లో దాదాపు 40 శాతం చెరువుల్లో పావు వంతు కంటే తక్కువ నీరు ఉందని చెప్పారు. వర్షాభావం, అధిక ఉష్ణోగ్రతల కారణంగా నీరు ఆవిరయ్యే ప్రమాదం ఉన్నందున చెరువులు, కుంటలు, జలాశయాల్లో మిగిలిన నీటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. తాగునీటి అవసరాలకు ప్రాధాన్యమిస్తూ, పశువులు, పక్షులు, వన్యప్రాణుల అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకోవాలని కోరారు. రాష్ట్రంలో సుమారు 53 లక్షల కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, ఇందుకోసం డిస్కంలకు ఏటా సుమారు రూ.5,000 కోట్లు చెల్లిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ కోసం ఏటా సుమారు రూ.14,000 కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు.

**గ్రామీణ ఉపాధికి 17 లక్షలకు పైగా పనులు**

కరువు పరిస్థితుల్లో వ్యవసాయ పనులు తగ్గితే గ్రామీణ కూలీలు, రైతులకు ఉపాధి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ పనులు సిద్ధం చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద ఇప్పటికే 9.1 లక్షల పనులను గుర్తించామని, అదనంగా మరో 8 లక్షల పనులను గుర్తించేలా చర్యలు చేపట్టామని చెప్పారు. వ్యవసాయ కుంటలు, ఇంకుడు గుంతలు, బోర్ల రీచార్జి, పశువుల షెడ్లు, కోళ్ల షెడ్లు, నర్సరీలు, ఉద్యానవనాల అభివృద్ధి, నీటి తొట్లు, గ్రామీణ రహదారులు, చెరువులు, కాల్వలకు సంబంధించిన పనులను చేపట్టాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకంలో రాష్ట్ర వాటా నిధులను సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

**సమష్టి కృషితోనే విపత్తును ఎదుర్కోగలం**

సూపర్ ఎల్‌నినో ప్రభావం అనేక దేశాలపై పడే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో శాస్త్రీయ సమాచారాన్ని అర్థం చేసుకుని ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమష్టిగా పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే అధికారులతో సమీక్ష నిర్వహించి క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశారని తెలిపారు. కరోనా సమయంలో మాదిరిగానే రాజకీయాలకు అతీతంగా సహకరించాలని ప్రతిపక్షాలను కోరారు. నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగిస్తూ రైతులు, కూలీలు, గ్రామీణ ప్రజల జీవనోపాధిని కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు.

# కార్యకర్తలకు లీగల్ సెల్ అండగా నిలవాలి!

మొదటిపేజీ తరువాయి

భవిష్యత్తులో తగిన గుర్తింపు, పదవులు లభిస్తాయని అన్నారు. ఇందిరా భవన్‌లో టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులందరికీ వర్తించేలా ఇందిరమ్మ ప్రమాద బీమా అమలు చేస్తామని శ్రీధర్‌బాబు తెలిపారు. ప్రస్తుతం రూ.2 లక్షలుగా ఉన్న ఆరోగ్య బీమా పరిమితిని రూ.5 లక్షలకు పెంచే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. న్యాయవాదుల సంక్షేమం, కార్పస్ ఫండ్ పెంపు, ఇతర సమస్యల పరిష్కారానికి త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మంత్రులు, న్యాయవాదుల సంఘాల ప్రతినిధుల సమావేశం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

**న్యాయవాదుల రక్షణకు చట్టం**

గతంలో వామన్‌రావు దంపతుల హత్య జరిగినప్పుడు ఇచ్చిన హామీ మేరకు న్యాయవాదుల భద్రత కోసం అసెంబ్లీలో అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావడంలో ప్రభుత్వం చొరవ చూపిందని మంత్రి పేర్కొన్నారు. న్యాయవాదుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. లా డిపార్ట్‌మెంట్ ముఖ్యమంత్రి పరిధిలోనే ఉన్నందున సంబంధిత అంశాలపై త్వరలో చర్చిస్తామని తెలిపారు. ప్రభుత్వ న్యాయవాదులు, అదనపు ప్రభుత్వ న్యాయవాదులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, స్టాండింగ్ కౌన్సిల్ పోస్టుల భర్తీపై ముఖ్యమంత్రి కసరత్తు చేస్తున్నారని శ్రీధర్‌బాబు చెప్పారు. నియామకాలతో పాటు వారి పనితీరును సమీక్షించేందుకు పనితీరు ఆడిట్ ప్రమాణాలను రూపొందించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థుల ఎంపికలో న్యాయవాదుల సంఘాలు సహకరించాలని కోరారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పరీక్ష కటాఫ్ మార్కుల అంశాన్ని న్యాయశాఖ కార్యదర్శి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయపరంగా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

**పార్టీ బలోపేతానికి న్యాయవాదుల సహకారం**

2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం న్యాయవాదులంతా ఐక్యంగా పనిచేశారని మంత్రి గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వివిధ కోర్టుల్లో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాదులతో పాటు కొత్తగా ఎన్‌రోల్ అయిన యువ న్యాయవాదులు కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పాల్గొనాలని ఆహ్వానించారు. నవంబర్ 1న ఢిల్లీలో రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే సమక్షంలో జరిగే కార్యక్రమానికి తెలంగాణ నుంచి న్యాయవాదులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఢిల్లీకి వచ్చే వారికి ప్రయాణ, వసతి ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో న్యాయవాదులు ఎన్‌రోల్‌మెంట్ చేయించుకుని కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలవాలని, పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్‌రెడ్డిని గెలిపించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, వివేక్ వెంకటస్వామి, ఏఐసీసీ ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్ మధుయాష్కీగౌడ్ తదితర ముఖ్యనేతలు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకు నిరంతర నిఘా

- గోల్డెన్ అవర్‌లో క్షతగాత్రులకు వైద్యం అందించాలి : సీపీ గౌష్ ఆలం



**కాకతీయ, కరీంనగర్:** వరంగల్-కరీంనగర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-563)పై ప్రయాణికుల భద్రత, ప్రమాదాల నివారణకు చేపట్టిన ఏర్పాట్లను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొత్తగట్టు వద్ద ఏర్పాటు చేసిన హైవే పెట్రోలింగ్ యూనిట్, టోల్ ప్లాజా అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌ను సందర్శించారు. అక్కడి సీసీ కెమెరాల పనితీరు, నిఘా వ్యవస్థ, కంట్రోల్ రూమ్ ద్వారా వాహనాల రాకపోకలను పర్యవేక్షించే విధానాన్ని పరిశీలించారు. ప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల్లో సమాచారం అందుకునే వ్యవస్థ, సంఘటనా స్థలానికి సిబ్బంది చేరుకునే విధానం, క్షతగాత్రులకు వైద్యసాయం అందించే చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. జాతీయ రహదారిపై పెట్రోలింగ్ వాహనాలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సీపీ ఆదేశించారు. ప్రమాదం జరిగినప్పుడు క్షతగాత్రులను ‘గోల్డెన్ అవర్’లో ఆసుపత్రులకు తరలించేలా సమన్వయ వ్యవస్థను పటిష్ఠం చేయాలని సూచించారు. సీసీ కెమెరాల నిఘాను నిరంతరం పర్యవేక్షిస్తూ, అతివేగంగా వెళ్లే వాహనాలు, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించేవారిపై దృష్టి సారించాలన్నారు. వాహనదారులు నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీల్లో హుజూరాబాద్ ఏసీపీ మాధవి, రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కేశవపట్నం ఎస్‌ఐ శేఖర్, హైవే అథారిటీ ప్రతినిధులు, టోల్‌గేట్ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గోదావరి జలాలెందుకు ఎత్తిపోయరు?





(మొదటిపేజీ తరువాయి)

ప్రాజెక్టులో భాగమైన కన్నెపల్లి పంప్‌హౌస్‌ను బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, కె.పి. వివేకానంద గౌడ్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డితో పాటు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి సందర్శించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. జూన్ నుంచి ఇప్పటివరకు 750 టీఎంసీలకు పైగా గోదావరి జలాలు సముద్రంలో కలిశాయని పేర్కొన్నారు. కనీసం 250 టీఎంసీల నీటినైనా ఎత్తిపోసి జలాశయాలు, చెరువుల్లో నిల్వ చేసి ఉంటే భూగర్భ జలమట్టాలు పెరిగేవని, హైదరాబాద్ తాగునీటి అవసరాలకు ఉపశమనం లభించేదని అభిప్రాయపడ్డారు.

**ప్రజల కష్టాలు కనిపించడం లేదా?**

ఎమ్మెల్యే కె.పి. వివేకానంద గౌడ్ మాట్లాడుతూ.. హైదరాబాద్ నీటి సమస్యపై జూలైలోనే బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని గుర్తుచేశారు. ఎల్‌నినో ప్రభావం, భవిష్యత్తులో తలెత్తే నీటి ఎద్దడిపై అప్పుడే హెచ్చరించినట్లు తెలిపారు. నీటిని ఎత్తిపోసుకోవాలని సూచించిన ఇంజినీర్లను ముఖ్యమంత్రి బెదిరించారని ఆయన ఆరోపించారు. ప్రజలకు తాగునీరు అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. హైదరాబాద్‌కు ఏడాది పాటు తాగునీరు అందించేందుకు సుమారు 10 టీఎంసీల నీరు సరిపోతుందని పేర్కొంటూ, కన్నెపల్లి నుంచి వెంటనే నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదన్నారు. మూడు రోజులకోసారి నీరు వచ్చినా తక్కువ పీడనంతో సరఫరా అవుతోందని ప్రజలు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. సింగూరు, మంజీరా జలాశయాల్లో నిల్వలు తగ్గుతున్నాయని వాటర్‌బోర్డు అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ముందుగానే తగినంత నీటిని నిల్వ చేసుకుని ఉంటే ప్రస్తుత పరిస్థితిని నివారించవచ్చని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే నీటి ఎద్దడికి కారణమని ఆరోపించారు.

**నగరంలో పెరిగిన ట్యాంకర్ల గిరాకీ**

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో వాటర్ ట్యాంకర్లకు డిమాండ్ పెరిగిందన్నారు. అక్టోబర్‌లోనే రోజుకు సుమారు 7 వేల ట్యాంకర్ బుకింగ్‌లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇది వేసవి కాలాన్ని తలపించే పరిస్థితి అని వ్యాఖ్యానించారు. మరోవైపు మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లకు నష్టం కలిగించే ఘటనపై ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని, మరమ్మతులు కూడా చేపట్టలేదని ఆయన ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారంతో తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలిగిస్తున్నారని ముఖ్యమంత్రిపై విమర్శలు చేశారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. నీటి సంక్షోభాన్ని నివారించే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. హైదరాబాద్ ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా ఇప్పటికైనా గోదావరి జలాలను ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో కరోనా సమయంలోనూ నీరు, విద్యుత్ వంటి అత్యవసర సేవలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ.. విలువైన గోదావరి జలాలు సముద్రంలో కలుస్తుండగా, హైదరాబాద్ తాగునీటి సమస్య తీవ్రతరం కావడం ఆందోళనకరమన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయి నగర ప్రజలకు తాగునీటి భరోసా కల్పించాలని కోరారు. హైదరాబాద్ తాగునీటి సమస్యపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. గోదావరి జలాలను వినియోగించుకునే చర్యలు చేపట్టి జలాశయాల్లో నిల్వలు పెంచాలని కోరారు. ప్రజలకు తాగునీటి సరఫరా మెరుగుపరచకపోతే హైదరాబాద్ ప్రజలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

# ఓటు బచావో–దేశ్ బచావో..

- ఢిల్లీకి మాదిగలు తరలిరావాలి
- నవంబర్ 1న రామ్‌లీలా మైదానంలో నిరసన కార్యక్రమం
- డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం
- మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పెరుమాండ్ల రామకృష్ణ

**కాకతీయ, హన్మకొండ :** ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ కోసం నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన కార్యక్రమానికి తెలంగాణ నుంచి మాదిగలు, దళితులు, బహుజనులు భారీగా తరలిరావాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ మాదిగ పిలుపునిచ్చారు. దళితులు ఓట్లు వేస్తేనే కేసీఆర్ గెలిచారంటూ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. దళిత సమాజాన్ని కించపరిచేలా మాట్లాడటం తగదన్నారు. స్వేరో కమాండ్‌మెంట్స్, నీతి, నిజాయితీ గురించి మాట్లాడిన ప్రవీణ్ కుమార్ ప్రస్తుతం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ప్రభావంతో మాట్లాడుతున్నారనే భావన కలుగుతోందని వ్యాఖ్యానించారు. మాదిగ హక్కుల దండోరా హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా వక్కల ప్రభాకర్‌ను నియమించినట్లు ప్రకటించారు. నియోజకవర్గాల ఇన్‌చార్జులుగా పులి శ్రీనివాస్, కొట్టె రమేష్, కొట్టె రాజు, గబ్బెట సుధాకర్ తదితరులను నియమించారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, పదవీ విరమణ చేసిన ప్రధానోపాధ్యాయుడు కొమ్ముల బాబు చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును కాపాడేందుకు నిరసన కార్యక్రమంలో భాగస్వాములు కావాలని వారు కోరారు.



# చిక్కుముడి విప్పే పోలీసు!

ఒక మృతి.. ఎన్నో అనుమానాలు! ఒక హత్య.. అంతుచిక్కని పరిణామాలు! మరోచోట రెండు వర్గాల మధ్య ముదిరిన వివాదం! ఇలాంటి సందర్భాల్లో ఒక్కో ఆధారాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తూ వాస్తవాల దిశగా దర్యాప్తును నడిపించడం పోలీసులకు సవాలే. నేరం వెనుక కారణాలను వెలికితీయడం, నిందితులను గుర్తించడం, బాధితులకు న్యాయం జరిగేలా చూడటంతో పాటు వివాదాలు శాంతిభద్రతల సమస్యలుగా మారకుండా పరిష్కారానికి చొరవ చూపడం కీలకం. గీసుగొండ సీఐ విశ్వేశ్వర్ ఏడాది కాలంగా ఈ తరహా బాధ్యతలు నిర్వర్తిస్తూ తనదైన గుర్తింపు పొందుతున్నారు. సంచలనాత్మక కేసుల దర్యాప్తు నుంచి స్థానిక సంఘాల మధ్య సయోధ్య వరకు విభిన్న అంశాల్లో చొరవ చూపుతున్నారు. నేరాల నియంత్రణ, ప్రజల్లో అవగాహన పెంపు, ఎన్నికలు–జాతరల్లో శాంతిభద్రతల పరిరక్షణపైనా దృష్టి సారిస్తున్నారు.

- కాకతీయ, గీసుగొండ



- క్లిష్ట కేసుల ఛేదనలో సీఐ విశ్వేశ్వర్ ప్రత్యేక ముద్ర
- సంచలనాత్మక కేసుల దర్యాప్తులో కీలక పాత్ర
- పెట్రోల్ దాడి హత్య కేసులో వేగంగా నిందితుల గుర్తింపు
- లారీ, హమాలీ సంఘాల వివాదాలకు ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో పరిష్కారం
- ఏడాదిలో గీసుగొండ స్టేషన్ పరిధిలో నేరాల రేటు 25 శాతం తగ్గింపు
- సర్పంచ్ ఎన్నికలు, కొమ్మాల జాతరలో శాంతిభద్రతల పరిరక్షణ
- యువత డ్రగ్స్ బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు
- ప్రశంసలు అందుకుంటున్న యువ పోలీసు అధికారి

### నేరాల రేటు తగ్గింపునకు ప్రత్యేక చర్యలు

కేసులు జరిగిన తర్వాత స్పందించడమే కాకుండా, నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంపైనా సీఐ విశ్వేశ్వర్ దృష్టి సారించారు. గీసుగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏడాది కాలంలో నేరాల రేటు 25 శాతం తగ్గినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. అనుమానాస్పద పరిణామాలపై నిఘా, సిబ్బంది సమన్వయం, ప్రజల్లో అవగాహన పెంపునకు ప్రాధాన్యమిచ్చారు. సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, బాలబాలికలపై జరిగే నేరాల నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని వివరించే కార్యక్రమాలకు ప్రాధాన్యమిచ్చారు. నేరం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడంతో పాటు, నేరాలకు దారితీసే పరిస్థితులపై ప్రజల్లో అవగాహన కల్పించడం కూడా పోలీసు విధుల్లో ముఖ్యమైన భాగంగా మారింది. గీసుగొండ మండలంలో గ్రామస్థాయి రాజకీయ పోటీలు, వర్గ విభేదాలు శాంతిభద్రతలపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. సర్పంచ్ ఎన్నికల సమయంలో పరిస్థితులను పర్యవేక్షిస్తూ సీఐ విశ్వేశ్వర్ పోలీసు సిబ్బందితో సమన్వయం చేసుకున్నారు. ప్రాధాన్యం సంతరించుకున్న కొమ్మాల జాతర సందర్భంగా బందోబస్తు, పర్యవేక్షణ చర్యలకు ప్రాధాన్యమిచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించారు. రాజకీయాలకు అతీతంగా చట్టాన్ని అమలు చేస్తూ పరిస్థితులు అదుపు తప్పకుండా చూడటంపై దృష్టి పెట్టారు.




### తొలి వారంలోనే.. రెండు వర్గాల మధ్య సయోధ్య

గీసుగొండ పోలీస్‌స్టేషన్‌లో సీఐగా బాధ్యతలు చేపట్టిన మొదటి వారంలోనే లారీ అసోసియేషన్‌లోని రెండు వర్గాల మధ్య వివాదం ఆయన ముందుకొచ్చింది. ఇరువర్గాలు పరస్పరం కేసులు నమోదు చేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ సమస్యను కేవలం కేసుల నమోదు వరకే పరిమితం చేయకుండా, వివాదానికి దారితీసిన అంశాలను తెలుసుకునేందుకు విశ్వేశ్వర్ ప్రయత్నించారు. ఇరు వర్గాలతో చర్చలు జరిపి వారి సమస్యలను అర్థం చేసుకున్నారు. పరస్పర విభేదాలు తగ్గేలా చొరవ తీసుకోవడంతో విడిపోయిన వర్గాల మధ్య సయోధ్యకు మార్గం ఏర్పడింది. వరంగల్ రైల్వే గూడ్స్ షెడ్‌ను చింతలపల్లికి తరలించే సమయంలో పాత, కొత్త హమాలీ సంఘాల మధ్య విభేదాలు తలెత్తాయి. కార్మికుల మధ్య నెలకొన్న వివాదం మరింత ముదరకుండా సీఐ ఇరువర్గాలతో సంప్రదింపులు జరిపారు. పరస్పర అభిప్రాయాలను తెలుసుకొని, సమస్య పరిష్కారానికి కృషి చేశారు. వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు ఆయన అనుసరించిన ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం ఈ ఘటనల్లో కనిపించింది.




### పెట్రోల్ దాడి.. హత్య కేసు దర్యాప్తులో శరవేగం..

ఇందిరానగర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు అడుప మహేశ్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య చేసిన ఘటన తీవ్ర కలకలం రేపింది. కేసులో నిందితులను గుర్తించడం పోలీసులకు కీలకంగా మారింది. సీఐ విశ్వేశ్వర్ నేతృత్వంలోని పోలీసు బృందం దర్యాప్తును వేగవంతం చేసింది. ప్రధాన నిందితుడిగా పేర్కొన్న పత్తి కుమార్‌తో పాటు మరో ఏడుగురిని రెండు, మూడు రోజుల్లో గుర్తించి పట్టుకున్నారు. అనంతరం అభియోగపత్రం దాఖలు చేసే ప్రక్రియను పూర్తి చేశారు. సంచలనాత్మక నేరాల్లో నిందితులను గుర్తించడంతో పాటు, సేకరించిన ఆధారాలను చట్టపరమైన ప్రక్రియకు అనుగుణంగా సమీకరించడం కూడా కీలకం. ఈ కేసులో వేగంగా దర్యాప్తు కొనసాగించి తదుపరి చర్యలు చేపట్టడంతో పోలీసు బృందానికి పోలీసు ఉన్నతాధికారుల నుంచే కాకుండా ప్రజానీకం నుంచి కూడా ప్రశంసలు లభించాయి.

### ఒకే కుటుంబంలో ముగ్గురి హత్య..

ఐనవోలు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పునేల్ గ్రామంలో గర్భిణీ భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలను స్విమ్మింగ్ పూల్‌లో ముంచి హత్య చేసి, ఘటనను ఆత్మహత్యగా చిత్రీకరించారు. కొద్దిరోజుల క్రితమే జరిగిన ఈ ఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి మృతి, దాని వెనుక ఉన్న పరిస్థితులపై అనుమానాలు ఈ కేసును క్లిష్టంగా మార్చాయి. దర్యాప్తు బృందంలో ఉన్న సీఐ విశ్వేశ్వర్ ఈ కేసు ఛేదనలోనూ కీలక పాత్ర పోషించినట్లు పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. ఘటనకు సంబంధించిన పరిస్థితులు, అందుబాటులో ఉన్న ఆధారాలను విశ్లేషిస్తూ కేసు ఛేదనకు సహకరించారు. మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్ల ముఠాను పట్టుకోవడంలోనూ ఆయన కీలకంగా వ్యవహరించినట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. వివిధ ప్రాంతాలకు విస్తరిస్తున్న సైబర్ నేరాల దర్యాప్తులో సమాచారం సేకరణ, నిందితుల గుర్తింపు, పోలీసు బృందాల సమన్వయం కీలకంగా మారుతున్నాయి.

### స్టేషన్ అభివృద్ధికి చొరవ

విధి నిర్వహణతో పాటు పోలీస్‌స్టేషన్ మౌలిక వసతుల మెరుగుదలకూ సీఐ విశ్వేశ్వర్ వ్యక్తిగతంగా చొరవ తీసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను శ్రద్ధగా విని, చట్టపరిధిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవడంపై దృష్టి సారిస్తున్నారు. కిందిస్థాయి సిబ్బందితో సమన్వయంగా పనిచేస్తూ విధుల నిర్వహణలో వారికి సహకరిస్తున్నారు. గతంలో ఇదే పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా పనిచేసిన విశ్వేశ్వర్ తిరిగి సీఐగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్నారు. క్లిష్టమైన కేసుల దర్యాప్తు, వివాదాల పరిష్కారం, నేరాల నియంత్రణ, ఎన్నికలు–జాతరల్లో శాంతిభద్రతల నిర్వహణ.. ఇలా విభిన్న బాధ్యతల మధ్య ముందుకు సాగుతున్నారు. ఒకవైపు ఆధారాల ఆధారంగా కేసుల చిక్కుముడులను విప్పే ప్రయత్నం.. మరోవైపు వివాదాలు పెద్దవిగా మారకముందే సయోధ్యకు చొరవ.. ఈ రెండు కోణాల్లోనూ గీసుగొండలో తనదైన గుర్తింపు పొందుతున్నారు.

## సర్పంచులను పక్కనపెట్టి ఇళ్ల ఎంపిక సరికాదు

- గ్రామసభల ద్వారానే లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలి
- జీవో 33, హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలి
- బీఆర్ఎస్ నేతలు బానోతు సారంగపాణి, చెట్టుపల్లి మురళీధర్ డిమాండ్



**కాకతీయ, నల్లబెల్లి :** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను సర్పంచుల అధ్యక్షతన గ్రామసభల ద్వారానే చేపట్టాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోతు సారంగపాణి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్ డిమాండ్ చేశారు. శనివారం నల్లబెల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 33, హైకోర్టు ఆదేశాలను అమలు చేయకుండా సర్పంచులను పక్కనపెట్టి కమిటీల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పేరుతో కొందరు అధికార పార్టీ నాయకులు పేదల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. అర్హులైన పేదలకు పారదర్శకంగా ఇళ్లు మంజూరు చేయాలని, లేకపోతే మండలవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సర్పంచుల ఫోరం నాయకులు పులి రమేష్ గౌడ్, జాటో రవి చిన్న, మచ్చిక రవి, ఇంగ్లీ శివాజీ, సర్పంచులు దండెం సంపత్, నాగలి జ్యోతి ప్రకాష్, మంద సుజాత రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వర్ధన్నపేట అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి

- మౌలిక వసతుల కల్పనకు మంత్రులకు ఎమ్మెల్యే వినతి
- రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సమస్యలపై చర్చ
- ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు, మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి విజ్ఞప్తి



**కాకతీయ, వర్ధన్నపేట :** వర్ధన్నపేట నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు, మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి రాష్ట్ర మంత్రులను కోరారు. శనివారం హైదరాబాద్‌లో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని వేర్వేరుగా కలిసి అభివృద్ధి అంశాలపై చర్చించారు. వర్ధన్నపేట మున్సిపాలిటీలో అంతర్గత రహదారులు, డ్రైనేజీల అభివృద్ధి, తాగునీటి సమస్య పరిష్కారం, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక నిధులు అవసరమని ఎమ్మెల్యే వివరించారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచే అంశాలను కూడా మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమని కే.ఆర్. నాగరాజు పేర్కొన్నారు. మంత్రులు సానుకూలంగా స్పందించారని, వర్ధన్నపేట అభివృద్ధికి ప్రభుత్వ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, వర్ధన్నపేట మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నేతావత్ శిబారాణి రాజేందర్, మండల యువజన అధ్యక్షుడు పత్రి భాను, నాయకులు శ్రీపాద సతీష్, నాంపల్లి యాదగిరి పాల్గొన్నారు.

## రూ.150 కోట్లతో శాశ్వత కరువు నివారణ!

- మిడ్జిల్, ఉప్పునూతల, మక్తల్ మండలాల్లో ప్రత్యేక ప్రాజెక్టు
- ప్రతి గ్రామంలో సభలు.. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు
- ఖర్చు చేసే ప్రతి రూపాయికీ లెక్క ఉండాలి: మంత్రి పొంగులేటి



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** కరువు పరిస్థితులు ఎప్పుడు ఎదురైనా ప్రజలు, రైతులు తట్టుకునేలా రాష్ట్రంలోని మూడు మండలాల్లో రూ.150 కోట్లతో శాశ్వత నివారణ చర్యలు చేపట్టనున్నట్లు రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నీటి వనరుల సమర్థ వినియోగం, రైతు కుటుంబాల జీవనోపాధి మెరుగుదల లక్ష్యంగా ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కరువు ప్రభావిత ప్రాంతాలను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని మిడ్జిల్, నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఉప్పునూతల, నారాయణపేట జిల్లాలోని మక్తల్ మండలాలను ఈ ప్రాజెక్టు కోసం ఎంపిక చేసినట్లు మంత్రి తెలిపారు. జాతీయ విపత్తుల నిర్వహణ నిధి సహకారంతో చేపట్టే ఈ కార్యక్రమానికి విపత్తుల నిర్వహణ శాఖ పర్యవేక్షణ వహిస్తుందని, వ్యవసాయ శాఖ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందని వివరించారు. కరువు ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతాలు, వర్షాధార వ్యవసాయం, సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనం, రైతు కుటుంబాల జీవనోపాధి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని మండలాలను ఎంపిక చేసినట్లు చెప్పారు.

**గ్రామసభలతో కార్యాచరణ**

రాష్ట్ర సచివాలయంలో శనివారం వ్యవసాయ, విపత్తుల నిర్వహణ శాఖల అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. కరువు నిరోధక వ్యవసాయ విధానాలు, శాశ్వత పరిష్కారాలు, ప్రాజెక్టు కార్యాచరణ, నిధుల వినియోగంపై చర్చించారు. ఎంపిక చేసిన ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి, ప్రజల అభిప్రాయాలు, స్థానిక అవసరాలకు అనుగుణంగా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసుకుంటూ గ్రామ, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రభుత్వ లక్ష్యాలు క్షేత్రస్థాయిలో నెరవేరుతాయని అన్నారు. కరువు ప్రభావం వ్యవసాయానికే పరిమితం కాదని, గ్రామీణ ఉపాధి, కుటుంబ ఆదాయాలు, సంప్రదాయ వృత్తులపైనా పడుతుందని మంత్రి పేర్కొన్నారు. మహిళలు, యువత, రైతులు, కులవృత్తులపై ఆధారపడిన కుటుంబాలు సహా అన్ని వర్గాల అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. స్థానిక పరిస్థితులకు తగిన శాశ్వత పరిష్కారాలతో ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు.

**నిధుల వినియోగంపై నిరంతర పర్యవేక్షణ**

ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి సద్వినియోగం కావాలని పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. పనుల ఎంపిక, అమలు, నిధుల వినియోగం, క్షేత్రస్థాయి ఫలితాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులను ఆదేశించారు. పనులు పూర్తయ్యాయా లేదా అన్నదానికే పరిమితం కాకుండా, ప్రజలకు ఎంత మేర ప్రయోజనం కలిగింది, కరువు సమస్యను ఎదుర్కొనే సామర్థ్యం ఎంత పెరిగిందనే అంశాలను ప్రాజెక్టు విజయానికి ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో విపత్తుల నిర్వహణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జ, వ్యవసాయ శాఖ కమిషనర్ సురేంద్రమోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎన్. గోపి తదితర అధికారులు పాల్గొన్నారు.

## గచ్చిబౌలిలో లెదర్ కామన్ ఫెసిలిటీ సెంటర్

- డిజైనింగ్ నుంచి బ్రాండింగ్ వరకు ఆర్టిజన్లకు మార్గనిర్దేశం
- రుక్మాపూర్ లో పర్యావరణహిత చర్మశుద్ధి కర్మాగారాలు
- టీజీఎల్ఐపీసీ సమీక్షా సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు



**కాకతీయ, హైదరాబాద్ :** రాష్ట్రంలో లెదర్ ఇండస్ట్రీని మరింత బలోపేతం చేయడంతో పాటు, ఔత్సాహిక ఎస్సీ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు గచ్చిబౌలిలో ప్రత్యేకంగా కామన్ ఫెసిలిటీ సెంటర్ (సీఎఫ్‌సీ)ను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రుక్మాపూర్ లో సుమారు వేయి మందికి ఉపాధి కల్పించేలా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో పర్యావరణహిత చర్మశుద్ధి కర్మాగారాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శనివారం డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో తెలంగాణ లెదర్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కార్పొరేషన్(టీజీఎల్ఐపీసీ) ఉన్నతాధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో లెదర్ ఇండస్ట్రీ అభివృద్ధికి, ఆర్టిజన్లను ప్రోత్సహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఎస్సీ యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. అంతర్జాతీయ హంగులతో గచ్చిబౌలీలో హబ్ అండ్ స్పోక్ విధానంలో మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేయనున్న సీఎఫ్‌సీ ద్వారా రాష్ట్రంలోని ఆర్టిజన్ల ఉత్పత్తులకు అదనపు విలువ(వాల్యూ యాడెడ్)ను జోడిస్తామన్నారు. డిజైనింగ్ మొదలు బ్రాండింగ్ వరకు వారికి మార్గనిర్దేశం చేస్తామన్నారు. హుజురాబాద్ నియోజకవర్గం జమ్మికుంట, ఆర్మూర్ లో మైక్రో స్మాల్ ఎంటర్ ప్రైజెస్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎంఎస్ఈసీడీపీ) కింద ప్లగ్ అండ్ ప్లే విధానంలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో లిడ్ క్యాప్ కు ఎక్కడెక్కడ భూములు కేటాయించారు... వాటి ప్రస్తుత పరిస్థితి ఏంటనే అంశంపై క్షేత్రస్థాయిలో పరిశీలించిన నివేదిక అందజేయాలని సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, టీజీఎల్ఐపీసీ వీసీ అండ్ ఎండీ ప్రశాంత్ కుమార్, తెలంగాణ స్టేట్ లెదర్ ఇండస్ట్రియల్ ప్రమోషన్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ప్రెసిడెంట్ డా.ఆరేపల్లి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు కేశవపట్నం విద్యార్థినులు

**కాకతీయ, శంకరపట్నం:** మండలంలోని కేశవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఆది దుర్గ, నేహా వాలీబాల్ క్రీడలో ప్రతిభ కనబరిచి కరీంనగర్ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఈ నెల 25న పాఠశాలలో నిర్వహించనున్న అండర్ 14 బాలబాలికల వాలీబాల్ పోటీల నేపథ్యంలో వారి ఎంపికపై ప్రధానోపాధ్యాయుడు సుభాష్ అభినందనలు తెలిపారు. విద్యార్థినులకు శిక్షణ అందించిన వ్యాయామ ఉపాధ్యాయుడు భక్తు రాజ్‌కుమార్‌ను ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి పాఠశాలకు, గ్రామానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## ముందస్తు ప్రణాళికతోనే 'ఎల్ నినో'కు చెక్!

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**కాకతీయ,రాయపర్తి /వర్ధన్నపేట :** ఎల్‌నినో ప్రభావ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.శనివారం వర్ధన్నపేట,పర్వతగిరి,సంగెం,నెక్కొండ మండలాల్లోని పలు గ్రామాల్లో కలెక్టర్ పర్యటించి ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.వర్ధన్నపేట మండలం కొత్తపల్లి గ్రామపంచాయతీ,పర్వతగిరి మండలం సోమారం గ్రామపంచాయతీ,సంగెం మండలం తీగరాజుపల్లి, సోమ్లాతండా గ్రామపంచాయతీలు, నెక్కొండ మండలం పత్తిపాక గ్రామపంచాయతీల్లో చేపట్టిన ఫామ్ పాండ్ పనులు,గ్రామ సంఘాల (వివో) భవనాలు,సాగునీటి చెరువుల పనులను కలెక్టర్ పరిశీలించారు.వ్యవసాయ రంగంలో ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని, వరికి బదులు మొక్కజొన్న,కందులు ,మినుములు,సన్ ఫ్లవర్ ,తదితర నూనెగింజలు పంటలు పండించాలని సూచించారు.ఈ సందర్భంగా పనుల వద్ద ఉన్న ఉపాధి కూలీలతో మాట్లాడి,పనుల పురోగతి,అమలు తీరును అడిగి తెలుసుకున్నారు.ఎల్‌నినో ప్రభావాలను ఎదుర్కొనేందుకు గ్రామస్థాయిలో అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని,సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా సూచించారు.ఈ పర్యటనలో డీఆర్డీవో నాగ పద్మజ,జడ్పీ సీఈవో వసంత,సంబంధిత అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## కేశవపట్నంలో పడకేసిన పారిశుధ్యం

- మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్త
- దోమల విజృంభణతో విషజ్వరాల భయం
- అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం

**కాకతీయ, శంకరపట్నం :** శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామంలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పలు వార్డుల్లో మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. మురుగునీరు నిలిచిపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని, ప్రజలు అనారోగ్య సమస్యలపై ఆందోళన చెందుతున్నారని స్థానికులు వాపోతున్నారు. పలు వీధుల్లో కాలువల్లో పూడిక తీయకపోవడం, చెత్త తొలగించకపోవడంతో దోమల బెడద పెరుగుతోందని గ్రామస్తులు అంటున్నారు. విషజ్వరాల భయం వెంటాడుతున్నా నివారణ చర్యలు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శిస్తున్నారు.

**రోగాలొస్తేనే స్పందిస్తారా?**

పారిశుధ్య సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యాధులు ప్రబలిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. గ్రామంలోని అన్ని వార్డుల్లో మురుగు కాలువలను శుభ్రం చేయాలని, పేరుకుపోయిన చెత్తను తొలగించాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామపంచాయతీ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# విద్యుత్ అంతరాయాల తగ్గింపునకు చర్యలు

- 33 కేవీ ఇంటర్‌లింక్ లైన్ల ఏర్పాటు
- 11 కేవీ లైన్లలో 28 ఫాల్ట్ ఇండికేటర్లు
- ప్రతి సబ్‌స్టేషన్‌లో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు



**కాకతీయ, ములుగు :** వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు ములుగు విద్యుత్ శాఖ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ బి.బి క్షపతి తెలిపారు. విద్యుత్ అంతరాయాలను తగ్గించేందుకు 33 కేవీ ఇంటర్‌లింక్ లైన్ల ఏర్పాటు, 11 కేవీ లైన్లలో ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్ల వినియోగం, ప్రతి సబ్‌స్టేషన్‌లో రెండు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రత్యామ్నాయ మార్గంలో సరఫరా ఒక విద్యుత్ లైన్‌లో లేదా సబ్‌స్టేషన్‌లో సాంకేతిక సమస్యలు, ప్రకృతి వైపరీత్యాలు, నిర్వహణ పనుల వల్ల సరఫరా నిలిచిపోతే మరో మార్గం ద్వారా విద్యుత్ అందించేందుకు 33 కేవీ ఇంటర్‌లింక్ లైన్లు ఉపయోగపడతాయని బిక్షపతి తెలిపారు. ఇప్పటి వరకు ఎనిమిది 33 కేవీ ఇంటర్‌లింక్ లైన్లను ఏర్పాటు చేసి సబ్‌స్టేషన్లను అనుసంధానించినట్లు తెలిపారు. దీంతో ఒక మార్గంలో అంతరాయం ఏర్పడినా ప్రత్యామ్నాయ మార్గం ద్వారా సరఫరాను పునరుద్ధరించవచ్చన్నారు. లోపాలను వేగంగా గుర్తించేందుకు 11 కేవీ విద్యుత్ లైన్లలో 28 ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్లను ఏర్పాటు చేసినట్లు ఎస్ఈ తెలిపారు. ఈ పరికరాలు లైన్లలో లోపం ఏర్పడిన ప్రాంతాన్ని వేగంగా గుర్తించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. దీంతో సిబ్బంది మొత్తం లైన్‌ను తనిఖీ చేయాల్సిన అవసరం తగ్గి, సమస్య ఉన్న చోటే మరమ్మతులు చేపట్టవచ్చన్నారు. ఫలితంగా విద్యుత్ సరఫరాను త్వరగా పునరుద్ధరించవచ్చన్నారు. ప్రతి సబ్‌స్టేషన్‌లో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా ప్రతి సబ్‌స్టేషన్‌లో రెండు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు బిక్షపతి తెలిపారు. వీటి ద్వారా విద్యుత్ లోడ్‌ను సమర్థంగా నిర్వహించి సరఫరా నాణ్యతను మెరుగుపరచవచ్చన్నారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థను పటిష్ఠం చేయడం, అంతరాయాల వ్యవధిని తగ్గించడం, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా శాఖ చర్యలు చేపడుతోందని ఆయన తెలిపారు.

## చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- కాకతీయ సేవా సమితి అధ్యక్షులు మండల నరసింహ రాములు
- నాగపురి కార్తీక్ కు సన్మానం



**కాకతీయ,వరంగల్ :** ఢిల్లీలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో రెండు గోల్డ్ మెడల్స్,రెండు సిల్వర్ మెడల్స్ సాధించిన వరంగల్ జిల్లా స్థానిక రంగశాయిపేట ప్రాంతానికి చెందిన నాగపురి శ్రీనాథ్ గారి కుమారుడు నాగపురి కార్తీక్ కు శనివారం రోజున కాకతీయ సేవాసమితి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కాకతీయ సేవా సమితి అధ్యక్షులు మండల నరసింహ రాములు కోలా రాము. బక్కి శ్రీధర్, కర్రె రాజ్ కుమార్, దామర కొండ నిరంజన్ లు వారి స్వగృహానికి వెళ్లి నాగపురి కార్తీక్ ను శాలువాలతో ఘనంగా సన్మానించారు అనంతరం స్వీట్లు తినిపించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కాకతీయ సేవా సమితి అధ్యక్షులు మండల నరసింహ రాములు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి కార్తీక్ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

## గిరిజన విద్యార్థులకు రాబిన్ హుడ్ ఆర్మీ అండ

- డిగ్రీ విద్యార్థులకు 8 ల్యాప్‌టాప్‌ల పంపిణీ
- కేజీబీవీ విద్యార్థినులకు 200 శానిటరీ నాప్‌కిన్‌లు





**కాకతీయ, ఏటూరునాగారం:** మారుమూల గిరిజన ప్రాంతాల విద్యార్థుల విద్యాభివృద్ధి, సంక్షేమానికి అండగా నిలిచేందుకు రాబిన్ హుడ్ ఆర్మీ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఏటూరునాగారం పరిసర ప్రాంతాల్లో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గిరిజన డిగ్రీ విద్యార్థులకు 8 ల్యాప్‌టాప్‌లు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం విద్యార్థినులకు 200 శానిటరీ నాప్‌కిన్‌లు పంపిణీ చేశారు. గిరిజన విద్యార్థులు ఆన్‌లైన్ అభ్యాసం, విద్యా సమాచార సేకరణకు వీలుగా హైదరాబాద్‌కు చెందిన ఆల్‌షోర్ టెక్నాలజీస్ సంస్థ 8 ల్యాప్‌టాప్‌లను అందించింది. రుతుస్రావ పరిశుభ్రత, మహిళా ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతోపాటు విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణకు హైదరాబాద్‌కు చెందిన జగతి ఫౌండేషన్ 200 శానిటరీ నాప్‌కిన్‌లను అందించింది. ఈ కార్యక్రమానికి ఏటూరునాగారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి. సూర్య ప్రకాశ్, అదనపు పోలీసు సూపరింటెండెంట్ మానన్ భట్ సహకరించారు. రాబిన్ హుడ్ ఆర్మీ ప్రతినిధులు రమేష్ బూసారపు, కిరణ్ కుమార్ కె., హర్ష, ఆల్‌షోర్ టెక్నాలజీస్ ఉద్యోగులు సుకాంత్ కె., ప్రదీప్ పి., జగదీష్ పి. పాల్గొన్నారు. వెనుకబడిన వర్గాలకు విద్యా వనరులు అందించడం, బాలికల ఆరోగ్యంపై అవగాహన పెంచడం తమ లక్ష్యమని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

## కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శులుగా నలుగురికి చోటు

- రావుల మల్లేశం, ముదిరెడ్డి శ్రీనివాసరెడ్డికి బాధ్యతలు
- కొలిపాక నారాయణ, మహంకాళి రామ్ సలీం నియామకం









**కాకతీయ, ఇనుగుర్తి:** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, విజయానికి నిరంతరం కృషి చేస్తామని నూతనంగా నియమితులైన మండల ప్రధాన కార్యదర్శులు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్ ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు బైరు అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో రావుల మల్లేశం, ముదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కొలిపాక నారాయణ, మహంకాళి రామ్ సలీంలను మండల ప్రధాన కార్యదర్శులుగా నియమించినట్లు అశోక్ గౌడ్ తెలిపారు. పార్టీ విజయంలో కీలక పాత్ర పోషిస్తున్న సీనియర్ నాయకులకు బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. తమపై నమ్మకంతో అవకాశం కల్పించిన ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్, ఎంపీ బలరాం నాయక్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, జెన్నారెడ్డి భరత్ చంద్రరెడ్డి, మండల అధ్యక్షుడు అశోక్ గౌడ్, జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలకు నూతన ప్రధాన కార్యదర్శులు కృతజ్ఞతలు తెలిపారు.

## కోర్టు వాయిదాలను ధిక్కరించిన వ్యక్తి అరెస్టు

**కాకతీయ, నెల్లికుదురు:** కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకొని తిరుగుతున్న వ్యక్తి ని అరెస్ట్ చేసినట్లు ఎస్సై గంగారపు కరుణాకర్ తెలిపారు. శనివారం ఆయన వివరాలు తెలుపుతూనెల్లికుదురు పోలీస్ స్టేషన్ పరిధిలోని మెచరాజుపల్లి గ్రామానికి చెందిన నన్నబోయిన జక్కుల పుల్లయ్య అను అతను కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకొని తిరుగుతున్నాడు. ఈ క్రమంలో గౌరవ తొర్రూర్ కోర్టు వారు సదరు వ్యక్తిపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేయడంతో కోర్టు ఆదేశాల మేరకు తమ సిబ్బందితో కలిసి సదరు వ్యక్తి కోసం గాలింపు చేపట్టగా విశ్వసనీయ సమాచారం మేరకు నన్నబోయిన జక్కుల పుల్లయ్య తన ఇంటి వద్ద ఉన్నట్లు సమాచారం అందడంతో అక్కడికి చేరుకొని అతడిని అదుపులోకి తీసుకొని అనంతరం కోర్టు ఎదుట హాజరుపరచగా, కోర్టు ఆదేశాల మేరకు అతడిని జైలుకు తరలించామని, కోర్టు వాయిదాలకు క్రమం తప్పకుండా హాజరుకావాలని, కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి తప్పించుకొని తిరిగే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్. ఐ. తెలిపారు.

## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి




**కాకతీయ, నర్సంపేట టౌన్:** ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు ఉద్యోగులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు డిమాండ్ చేశారు. 12 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఉద్యోగుల సమ్మెకు బీఆర్‌టీయూ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా 17 విభాగాల్లో పనిచేస్తున్న సుమారు 17 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని యువరాజు కోరారు. అధికారంలోకి వస్తే కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీని అమలు చేయాలని అన్నారు. ప్రజారోగ్య సేవల్లో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ధర్నాలో ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కలువాల లలిత, కార్యదర్శి గోలి సంధ్య, తంగెళ్ల సుజాత, పిట్టల శ్రీలత, సృజన, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## బహుజన ఆత్మగౌరవ ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్!

- పాపన్న పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలి
- కాంగ్రెస్ ఓబీసీ సెల్ జాతీయ కన్వీనర్ కత్తి వెంకటస్వామి గౌడ్ పిలుపు
- హనుమకొండ గౌడ హాస్టల్‌లో విగ్రహావిష్కరణ



**కాకతీయ, హన్మకొండ :** బహుజనుల ఆత్మగౌరవం, సమానత్వం కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని కాంగ్రెస్ ఓబీసీ సెల్ జాతీయ కన్వీనర్ కత్తి వెంకటస్వామి గౌడ్ పిలుపునిచ్చారు. సమాజ అభివృద్ధి కోసం బహుజనులంతా ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని కాకతీయ గౌడ హాస్టల్‌లో విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. పాపన్న గౌడ్ బహుజన వర్గాల ఆత్మగౌరవం, హక్కులు, సామాజిక పురోగతి కోసం చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమని కత్తి వెంకటస్వామి గౌడ్ పేర్కొన్నారు. ఆయన జీవిత చరిత్రను యువత తెలుసుకోవాలని, ఆశయాలకు అనుగుణంగా సమాజంలో ఐక్యత, సమానత్వం, సేవాభావాన్ని పెంపొందించుకోవాలని కోరారు. గౌడ హాస్టల్‌లో విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా పాపన్న చరిత్ర, పోరాట స్ఫూర్తిని భావితరాలకు పరిచయం చేసే అవకాశం కలిగిందని నిర్వాహకులు తెలిపారు. విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు అనంతుల రమేష్ గౌడ్, జూలూరి రంజిత్ గౌడ్, మార్క రవి గౌడ్, కూనూరు రంజిత్ గౌడ్, డాక్టర్ సోల్తి కిరణ్ గౌడ్, మాచర్ల శరత్ గౌడ్‌తో పాటు గౌడ సంఘం నాయకులు పులి శ్రీనివాస్ గౌడ్, జనార్దన్ గౌడ్, మోహన్ గౌడ్, బొనగాని యాదగిరి గౌడ్, బైరి రవికృష్ణ గౌడ్, తీగల జీవన్ గౌడ్, స్వామి గౌడ్, అశోక్ గౌడ్, పెరుమాండ్ల వెంకట్ గౌడ్, టీవీ రాజ్ గౌడ్, యుగేందర్ గౌడ్, హరీష్ గౌడ్, జగన్ గౌడ్, మార్క విజయ్‌కుమార్ గౌడ్, సంజయ్ గౌడ్, సోల్తి సారయ్య గౌడ్, ఏకాంతం గౌడ్, గోపి గౌడ్, రాంకీ గౌడ్, సాగర్ గౌడ్, విజయ్ గౌడ్, కుమార్ గౌడ్, తేజ తదితరులు పాల్గొన్నారు.

## కల్పలత సూపర్‌బజార్‌లో ప్రక్షాళనకు శ్రీకారం!

- రూ.80 లక్షల నిధుల అవకతవకలపై సమగ్ర విచారణ
- అడ్మినిస్ట్రేటర్‌గా ఆర్డీఓ వెంకటేష్ నియామకం



**కాకతీయ, వరంగల్ :** వరంగల్ రంగంపేటలోని కల్పలత సూపర్‌బజార్ కోఆపరేటివ్ స్టోర్‌లో పరిపాలనను ప్రక్షాళన చేసి, ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత పెంచేందుకు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ చర్యలు చేపట్టారు. స్టోర్ అడ్మినిస్ట్రేటర్‌గా హనుమకొండ ఆర్డీఓ ఎన్. వెంకటేష్‌ను నియమించగా, ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు. స్టోర్‌లో సుమారు రూ.80 లక్షల నిధులకు సంబంధించి అవకతవకలు జరిగినట్లు జిల్లా సహకార అధికారి బాణావత్ మోహన్ నిర్వహించిన ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఈ నేపథ్యంలో గత నెలలో కే. కోదండరాములును అడ్మినిస్ట్రేటర్‌గా నియమించగా, తాజాగా సమగ్ర విచారణ, నిర్వహణలో పారదర్శకత లక్ష్యంగా ఆ బాధ్యతలను వెంకటేష్‌కు అప్పగించారు. తెలంగాణ సహకార సంఘాల చట్టం-1964లోని సెక్షన్ 34(1)(సి) ప్రకారం ఈ నియామకం చేపట్టారు.

**ఆర్థిక రికార్డుల సమర్పణకు ఆదేశాలు**

బాధ్యతలు స్వీకరించిన అనంతరం సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ సంధ్యారాణికి ఆర్డీఓ వెంకటేష్ కీలక ఆదేశాలు జారీ చేశారు. స్టోర్ ఆదాయ, వ్యయాలు, ఆర్థిక లావాదేవీలు, నిధుల వినియోగం, ఇతర రికార్డుల వివరాలను సమగ్రంగా సిద్ధం చేసి అందించాలని సూచించారు. నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయా అనే అంశంపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకొస్తామని తెలిపారు. స్టోర్ కార్యకలాపాలు సక్రమంగా కొనసాగడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా పారదర్శక పాలనకు అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## వలస ఆదివాసులపై దాడులు చేస్తే సహించం

- హక్కులకు భంగం కలిగిస్తే పోరాటం తప్పదు
- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.డి. దావూద్

**కాకతీయ, ఏటూరునాగారం :** వలస ఆదివాసులపై దాడులకు పాల్పడినా, వారి హక్కులకు భంగం కలిగించినా సహించేది లేదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.డి. దావూద్ హెచ్చరించారు. కన్నాయిగూడెం మండలంలో మలకపల్లి కోరం చిరంజీవి అధ్యక్షతన నిర్వహించిన వలస ఆదివాసుల జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలస ఆదివాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతోపాటు వారి భద్రత, జీవనోపాధికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆదివాసులపై దాడులు చేయడం, భయభ్రాంతులకు గురిచేయడం, వారి హక్కులకు భంగం కలిగించడం వంటి చర్యలకు ఎవరూ పాల్పడకూడదని స్పష్టం చేశారు. ఆదివాసులంతా ఐక్యంగా ఉండాలని, ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఎక్కడైనా దాడులు, వేధింపులు జరిగితే అధికారులు వెంటనే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని, ఆదివాసుల భద్రతకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వలస ఆదివాసుల హక్కుల పరిరక్షణకు సీపీఎం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారికి అన్యాయం జరిగితే బాధితుల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని దావూద్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జజ్జర దామోదర్, రవి, తోలం కృష్ణయ్య, మండల నాయకులు పాషా, భద్రయ్య, రామారావు, రాకేష్, రమేష్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

## నూతన క్రిమినల్ చట్టాలపై సాయుధ దళాలకు శిక్షణ





- 971 మంది సిబ్బందికి 20 బ్యాచ్‌లుగా శిక్షణ
- ఎఫ్ఐఆర్ నమోదు నుంచి సాక్ష్యాల సేకరణ వరకు అవగాహన
- పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఆధ్వర్యంలో కార్యక్రమం

**కాకతీయ, వరంగల్ బ్యూరో :** నూతన క్రిమినల్ చట్టాలపై పోలీసు సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ సూచనల మేరకు పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత కార్యాచరణ రూపొందించారు. కమిషనరేట్ పరిధిలోని సాయుధ దళాల్లో కానిస్టేబుల్ నుంచి కమాండెంట్ స్థాయి వరకు పనిచేస్తున్న 971 మంది సిబ్బందిని 20 బ్యాచ్‌లుగా విభజించి, మడికొండలోని పోలీస్ శిక్షణ కేంద్రంలో రోజుకు ఒక బ్యాచ్‌కు శిక్షణ ఇవ్వనున్నారు. శనివారం ఏసీపీ, శిక్షణ కేంద్రం వైస్ ప్రిన్సిపల్ రమణ బాబు పర్యవేక్షణలో తొలి బ్యాచ్‌కు శిక్షణ నిర్వహించారు. ఎఫ్ఐఆర్ నమోదు, అరెస్టుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నేరస్థలంలో సాక్ష్యాల సేకరణ, ధర్నాల నిర్వహణ, ముందస్తు అరెస్టులు, నేరాల వర్గీకరణపై వివరించారు. మహిళలపై నేరాలు, ఉగ్రవాద నిరోధక చట్టాలు, సైబర్ నేరాలు, నేర విచారణలో పోలీసుల అధికారాలపైనా అవగాహన కల్పించారు. ప్రధాన న్యాయ శిక్షకుడు, ఇన్‌స్పెక్టర్ సూర్యప్రకాశ్, సహాయక న్యాయ శిక్షకులు, ఎస్ఐలు విజయ్, దేవేందర్, ఆర్ఐ ఉదయభాస్కర్, ఆర్ఎస్ఐ రమేష్‌తో పాటు శిక్షణ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ బాణసంచా వ్యాపారులపై కొరడా

- అనుమతి లేకుండా నిల్వ చేసినా, విక్రయించినా చర్యలు
- దీపావళికి ముందే మట్వాడా పోలీసుల తనిఖీలు
- ఇన్‌స్పెక్టర్ ఎన్. కరుణాకర్ హెచ్చరిక



**కాకతీయ, వరంగల్:** దీపావళి పండుగ నేపథ్యంలో అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని మట్వాడా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎన్. కరుణాకర్ హెచ్చరించారు. ప్రజల భద్రత దృష్ట్యా వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ మట్వాడా పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమ బాణసంచా వ్యాపారాలపై ముందస్తు తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. బాణసంచా విక్రయించాలనుకునే వ్యాపారులు సంబంధిత అధికారుల నుంచి తప్పనిసరిగా లైసెన్సులు పొందాలని స్పష్టం చేశారు. నివాస ప్రాంతాలు, జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో బాణసంచా నిల్వ చేయడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. అలాంటి ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేసిన సరుకును స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వ్యాపారులు, ప్రజలు పోలీసులకు సహకరించి సురక్షితంగా దీపావళి జరుపుకోవాలని ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ కోరారు.

## వరంగల్ సిటీ ప్లానర్‌గా రవీంద్ర డి. రాడేకర్

- జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతితో పోస్టింగ్
- గతంలో ఇన్‌చార్జి సిటీ ప్లానర్‌గా సేవలు
- బల్దియాలో తీరనున్న ప్లానర్ కొరత



**కాకతీయ, వరంగల్:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన సిటీ ప్లానర్‌గా రవీంద్ర డి. రాడేకర్ నియమితులయ్యారు. ప్రభుత్వం ఆయనకు జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించి, వరంగల్ బల్దియాలో సిటీ ప్లానర్‌గా పోస్టింగ్ ఇచ్చింది. రవీంద్ర డి. రాడేకర్ గతంలో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇన్‌చార్జి సిటీ ప్లానర్‌గా విధులు నిర్వహించారు. పట్టణ ప్రణాళిక విభాగంలో ఆయనకు గతంలో పనిచేసిన అనుభవం ఉంది. పదోన్నతి అనంతరం తిరిగి వరంగల్‌లోనే నియమించడంతో నగర ప్రణాళిక విభాగానికి పూర్తిస్థాయి అధికారి అందుబాటులోకి వచ్చినట్లయింది. ఎల్ఆర్ఎస్, బీఆర్ఎస్, భవన నిర్మాణ అనుమతులు, అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణ వంటి అంశాలపై పెండింగ్ పనుల పరిష్కారంపై దృష్టి సారించాల్సి ఉంది. సిటీ ప్లానర్ నియామకంతో బల్దియాలో చాలాకాలంగా ఉన్న ప్లానర్ కొరత తీరనుంది.

## రెడ్యా నాయక్ తండాలో దాడి కలకలం

- ఇంట్లోకి చొరబడి విధ్వంసం చేసినట్లు ఫిర్యాదు
- మహిళపై కర్రలతో దాడి.. టీవీ, ఫర్నిచర్ ధ్వంసం
- ఇద్దరు నిందితుల అరెస్ట్.. 14 రోజుల రిమాండ్

**కాకతీయ, మద్దూరు:** మద్దూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెడ్యా నాయక్ తండాలో మహిళపై దాడి చేసి, ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేసిన ఘటనలో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై ఆసిఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. భూక్య విజయ (47) ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. అక్టోబర్ 4న రాత్రి ధరావత్ నిమ్మ, ధరావత్ బుజ్జి విజయతో పాటు ఆమె కుటుంబ సభ్యులను దుర్భాషలాడుతూ కర్రలతో దాడి చేసినట్లు ఆరోపణలున్నాయి. అక్టోబర్ 5న తెల్లవారుజామున ధరావత్ బుజ్జి (46), ధరావత్ కళ్యాణి (27) విజయ ఇంట్లోకి ప్రవేశించి మరోసారి దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనలో విజయ చేతికి తీవ్ర గాయమవడంతో పాటు టీవీ, ఫర్నిచర్ ధ్వంసమైనట్లు తెలిపారు. ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ధరావత్ బుజ్జి, ధరావత్ కళ్యాణిలను అరెస్ట్ చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు ఇద్దరినీ 14 రోజుల రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆసిఫ్ వెల్లడించారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలి

- తొలగించిన ఓటర్ల పేర్లను తిరిగి నమోదు చేయాలి
- ఎన్నికల ప్రధాన అధికారిని విధుల నుంచి తొలగించాలి
- రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట్ మావో డిమాండ్



**కాకతీయ, చేర్యాల:** కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్‌ను విధుల నుంచి తొలగించాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)ను నిలిపివేసి తొలగించిన ఓటర్ల పేర్లను తిరిగి నమోదు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట్ మావో డిమాండ్ చేశారు. ఈ మేరకు చేర్యాల పాత బస్టాండ్ వద్ద ప్రజా, వృత్తి సంఘాల ఆధ్వర్యంలో నిరసన నిర్వహించి, జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వెంకట్ మావో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ బీజేపీకి లబ్ధి చేకూర్చేలా వ్యవహరిస్తూ ఓటర్ల జాబితా నుంచి పౌరుల పేర్లను తొలగిస్తోందని ఆరోపించారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్య హక్కులకు విఘాతం కలిగిస్తాయని విమర్శించారు. ఓటు హక్కుకు సంబంధించిన ప్రక్రియను రాజ్యాంగ నిబంధనల ప్రకారం నిర్వహించాలని, ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగేలా చర్యలు తీసుకోవాలని, రాజ్యాంగబద్ధ సంస్థల స్వతంత్రతను కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకురాలు ఇప్పకయాల శోభతో పాటు ప్రజా, వృత్తి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## అసభ్య వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు

**కాకతీయ, చందుర్తి:** మహిళను కించపరిచేలా అసభ్య పదజాలంతో మాట్లాడటంతో పాటు, శారీరక సంబంధాల విషయంలో వేధిస్తూ మానసిక క్షోభకు గురిచేస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చందుర్తి ఎస్సై జె. రమేష్ తెలిపారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో వివరాలు వెల్లడించారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై విచారణ కొనసాగిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266